సాక్షి కర్నూలు

శనివారం ၊ 31 ၊ మే ၊ 2025



మహా కుంభాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోదండ రామాలయంలో మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. శ్రీ జగద్గురు శ్రీ విద్యా శంకర భారతి మహాస్వామి పాల్గొన్నారు.



పూల బాట

కృష్ణగిరి: టోల్‌గేట్ సమీపం నుంచి అమకతాడు లోకి వెళ్లే రహదారికి ఇరువైపులా సుంకేసుల చెట్లు ఎర్రని పూలతో ఆకర్షిస్తున్నాయి. ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి.



పీర్ల మసీదు నిర్మాణం

తుగ్గలి: రాంపల్లిలో పీర్ల మసీదు నిర్మాణం వేగంగా జరుగుతోంది. దాదాపు రూ.8లక్షలతో చేపట్టిన మసీదు నిర్మాణం చివరి దశకు చేరింది. మొహర్రం పండుగకు ప్రారంభం కానుంది.

న్యూస్‌రీల్

తుంగభద్రకు వరద

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 4,504 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీలోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం బ్యారేజీలో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో 4,345 క్యూసెక్కుల నీరు ఒక గేటు మీటర్ పైకెత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. 159 క్యూసెక్కులు కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు.

‘రెడ్‌బుక్’ తప్ప సంక్షేమం ఎక్కడ?

● ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



తిమ్మాపురంలో పర్యటిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలుకు నోచుకోలేదని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. చిప్పగిరి మండలంలోని తిమ్మాపురం, నంచర్ల గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నంచర్ల, తిమ్మాపురం గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కడపలో నిర్వహిస్తున్న మహానాడుతో రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఇంతవరకు ప్రజలకు ఏం చేశారో చెప్పలేని స్థితిలో టీడీపీ నేతలు ఉన్నారన్నారు. ఎన్ని మహానాడులు నిర్వహించినా వైఎస్సార్‌సీపీ ఇమేజ్‌ని ఇసుమంత కూడా తగ్గించలేదన్నారు. కార్యక్రమంలో హేమంత్, చల్లారామంజి, హనుమంతు, దేవేంద్ర పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (టౌన్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతాల ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు తెలపొద్దని సూచించారు. తెలియని ఆన్‌లైన్ లింకులపై క్లిక్ చేయరాదని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38 పోలీస్ స్టేషన్ల పరిధిలో ‘నేను సైబర్ స్మార్ట్’ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీతారామాపురానికి చేరుకున్న కృష్ణా జలాలు

బేతంచెర్ల: మెగా వాటర్ గ్రిడ్ పథకం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరబోతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న డోన్ నియోజకవర్గానికి కృష్ణాజలాలను అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంతో పాటు ఆయా గ్రామాలకు మొదటి విడతలో ఈ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రహదారి పనుల వల్ల సీతారామాపురం గ్రామానికి చెందిన పైపులైను వేయలేదు. ఇటీవల రహదారి పనులు పూర్తి కావడంతో పైపులైను వేసి గోరుకల్లు నీటిని గ్రామానికి తరలిస్తున్నారు. అక్కడ నుంచి మరో 5 గ్రామాలకు గోరుకల్లు రిజర్వాయర్ నీటిని అందించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి కృష్ణా జలాలు చేరడంతో గ్రామస్తులు పూజలు చేపట్టారు.

మరపురాని సేవలు..



పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన వృద్ధురాలికి అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



కరోనా సమయంలో గుమికూడవద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది, వలంటీర్లు



ప్రభుత్వ కార్యాలయాల్లో కాకుండా ఇంటి వద్దకే వెళ్లి రేషన్‌కార్డు అందిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి, వలంటీర్



కరోనా సమయంలో ఇంటి వద్దనే బాధితునికి ఆహారం అందిస్తున్న వలంటీర్



నంద్యాలలోని ర్యాపిడ్ టెస్ట్ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న వార్డు వలంటీర్

సేవలతో చేరువై.. కూటమి కుట్రకు బలై!

వలంటీర్లను వంచించిన కూటమి ప్రభుత్వం

- కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో సేవలకు తగిన గుర్తింపు
- అవార్డులు, నగదు ప్రోత్సాహకాలతో సన్మానం
- ప్రజల ఇంటి వద్దకే వెళ్లి పారదర్శకంగా పథకాల వర్తింపు
- ఎన్నికల సమయంలో వేతనం పెంచుతామని కూటమి నేతల హామీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సేవలు వినియోగం
- ఆ తర్వాత మాట మార్చి వీధిన పడేసిన వైనం



తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ నాడు నిర్వహించిన పంచాంగ శ్రవణం సాక్షిగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరని పరిస్థితి. ముఖ్యమంత్రిది ఓ మాట, మంత్రులది మరో మాట కావడంతో జిల్లాలో **దాదాపు 10వేల** మంది వలంటీర్ల **కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. రూ.5 వేల గౌరవ వేతనంతో** తమకు కేటాయించిన 50 కుటుంబాల్లో ఒకరుగా అందరి మన్నన లను పొందిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం నిర్ల యతో నేడు **దినసరి** కూలీలుగా **మారిపో**వడం గమనార్హం.

కర్నూలు(అర్బన్): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక, ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టారు. కొత్త ఉద్యోగాల కల్పన మాట దేవుడెరుగు, గత ప్రభుత్వంలో నియమించిన చిరుద్యోగులను రోడ్డున పడేశారు. దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిన వలంటీరు వ్యవస్థకు రూపమే లేదని ఎత్తేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను అర్హులైన పేద, మధ్య తరగతి వర్గాల దరికి చేర్చిన వలంటీర్లపై కూటమి ప్రభుత్వం కుట్ర చేసి వారిని శాశ్వతంగా ఇళ్లకు పంపింది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషకం కూడా రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికింది. అయితే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వారికి వేతనాలను నిలిపి వేయడంతో పాటు వలంటీర్ల వ్యవస్థకు జీఓనే లేదని తేల్చేసింది. దీంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వలంటీర్లు రోడ్డెక్కి ఆందోళనలను చేసినా, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

కూటమి ప్రభుత్వ కాఠిన్యం

తెల్లవారక ముందే అవ్వా, తాతలను నిద్రలేపి నిస్వార్థంగా పెన్షన్లు అందించిన వలంటీర్ల సేవలను రాజకీయ స్వార్థం కబళించింది. పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిట్లోనే అందించిన వారిపై వేటు వేసింది. అనేక సంక్షేమ పథకాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా అతి తక్కువ గౌరవ వేతనంతో అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు అందించిన వలంటీర్లపై కరుణ చూపించాల్సింది పోయి, కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. కరోనా కష్టకాలంలో సొంత కుటుంబ సభ్యులు కూడా తమ వారి వద్దకు వెళ్లి మంచి నీళ్లు, ఆహారం, మందులను అందించలేని పరిస్థితుల్లో కూడా వలంటీర్లు తమ కుటుంబాలను, ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు విశేష సేవలు అందించారు. అయితే అప్పట్లో వారు చేసిన సేవలకు కూటమి ప్రభుత్వం శాశ్వత సెలవు ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలో దాదాపు 10వేల వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం అందించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాన్ని అందించాలని వారు చేస్తున్న డిమాండ్ అరణ్యరోదనగా మిగిలిపోయింది.


విద్యుత్ పోల్స్ ఫ్యాక్టరీలో దినసరి కూలీగా..

ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు తుగ్గలి మండలం కింది చెరువుతండాకు చెందిన రమావత్ లక్ష్మానాయక్. డిగ్రీ వరకు చదువుకున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తమ తండాకు సమీపంలో ఉన్న ఎర్రగుడి గ్రామంలో వలంటీరుగా విధులు నిర్వహించాడు. వలంటీర్లను కూటమి ప్రభుత్వం తొలగించిన నేపథ్యంలో ప్రస్తుతం అనంతపురం జిల్లా బసినేపల్లిలోని విద్యుత్ పోల్స్ తయారీ ఫ్యాక్టరీలో దినసరి కూలీగా పనిచేసున్నాడు. రోజుకు 12 గంటలు పనిచేస్తే రూ.330 ఇస్తారని, పనికి పోతేనే కూలీ.. లేకపోతే లేదని లక్ష్మానాయక్ ఆవేదన **వ్యక్తం చేస్తున్నాడు.**



విద్యుత్ పోల్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రమావత్ లక్ష్మానాయక్

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు ఆశలు కల్పించాడని వాపోతున్నాడు. కనీసం నిరుద్యోగ భృతి కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తాం. వారికి నెలకు రూ.10 వేల పారితోషికం అందిస్తాం. చాలా మందిలో సమర్థత ఉంది. తెలివి తేటలు ఉన్నాయి. వర్క్ ఫ్రం హోం ద్వారా వీరి సేవలను ఉపయోగించుకుంటాం. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తాం.

– ఎన్నికలకు ముందు ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో చంద్రబాబునాయుడు



వలంటీర్ల వ్యవస్థే లేనప్పుడు ఎలా కొనసాగిస్తాం. లేని పిల్లవానికి ఏమి పేరు పెట్టమన్నట్లుంది.

– శాసనమండలిలో మంత్రి డోలా వీరాంజనేయ స్వామి

వాహనాలకు ప్రత్యామ్నాయ డ్రైవర్‌గా..



ఈ చిత్రంలోని వ్యక్తి పి.షేక్షావలి. కోసిగి మండలంలోని ఆర్లబండ స్వగ్రామం. డిగ్రీ వరకు చదువుకున్న ఇతను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానికంగానే వలంటీరుగా సేవలందించారు. ప్రస్తుతం ఏ పనీ లేకపోవడంతో తనకు వచ్చిన డ్రైవింగ్ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో ట్రాక్టర్, ఇతర వాహనాలకు డ్రైవర్లు లేని సమయంలో యాక్టింగ్‌గా పోతున్నాడు. పనికి పోయిన రోజు రూ.500 వస్తుంది. ఇలా నెలలో వారం రోజులు కూడా పని దొరకని పరిస్థితి. వలంటీర్లకు ఎన్నో ఆశలు కల్పించిన చంద్రబాబు తమను ఇలా వీధిన పడేశాడని కన్నీరు పెట్టుకున్నాడు. ఉన్న ఉద్యోగాలను కూడా ఊడగొట్టాడని.. మాలాంటి ఎంతో మంది పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని వాపోతున్నాడు.

నియోజకవర్గాల వారీగా పనిచేసిన వలంటీర్లు

నియోజకవర్గం	మొత్తం వలంటీర్లు
ఆదోని	1,073
ఆలూరు	1,383
కోడుమూరు	1,174
కర్నూలు	1,308
మంత్రాలయం	1,096
పాణ్యం	1,344
పత్తికొండ	1,310
ఎమ్మిగనూరు	1,382
మొత్తం:	10,070

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల సేవలకు అవార్డులు



వలంటీర్లు అందించిన సేవలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. నగదును అందించి ఘనంగా సన్మానించింది. వారు అందించిన సేవలకు గుర్తుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర లుగా విభజించి అవార్డులను అందించింది. గత ఏడాది ఫిబ్రవరిలో గతంలో ఉన్న అవార్డుల మొత్తాన్ని పెంచుతూ ఏకంగా సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేలను అందించి గౌరవించడం విశేషం.

వలంటీర్ల వల్లే అమ్మఒడి వచ్చింది



మా ఇంట్లో ఎవరూ పెద్దగా చదువుకోలేదు. పిల్లల చదువులకు సంబంధించి అవసరమైన సర్టిఫికెట్లు ఎక్కడ తెచ్చుకోవాలి, ఎవరితో సంతకాలు చేయించుకోవాలనే విషయాలు కూడా మాకు తెలియవు. జగనన్న అమ్మఒడి ఇచ్చిన సమయంలో వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి వివరాలన్నీ తీసుకువెళ్లి దరఖాస్తు చేయించాడు. వరుసగా నా ఇద్దరు పిల్లలకు అమ్మఒడి వచ్చింది. వలంటీర్లు లేకపోవడం వల్ల మాలాంటి చదువురానోళ్లకు ఇప్పుడు చాలా ఇబ్బందిగా ఉంది.

– భాగ్యమ్మ, గార్గేయపురం, కర్నూలు మండలం

నయాపైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కార్డులు



మా గ్రామంలో వలంటీరు సుధాకర్ నయాపైసా ఖర్చు లేకుండా నా కొడుకులు, మనవళ్లకు ఆరోగ్యశ్రీ కార్డులు తెప్పించాడు. మా ఇంటికే వచ్చి అవసరమైన పేపర్లు తీసుకొని పోయి నాకు ఫించన్ కూడా వచ్చేలా చేశాడు. సొంత పనులతో పాటు పొలాలకు సంబంధించిన విషయాల్లో ఏ అవసరం వచ్చినా, వలంటీరు పనులు చేసి పెట్టారు. ఇప్పుడు ఏ అవసరం పడినా గ్రామంలోని సచివాలయాలకు, లేకపోతే తుగ్గలికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– జిల్ల రంగప్ప, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

మా పిల్లల పేర్లు రేషన్‌కార్డులో చేర్చారు



రేషన్‌కార్డులో మా పిల్లల పేర్లు లేకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడ్డాం. ఈ విషయాన్ని వలంటీరు దృష్టికి తీసుకుపోయిన వెంటనే పిల్లలకు సంబంధించిన జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జీరాక్స్ కాపీలను తీసుకుపోయి ప్రభుత్వం అవకాశం కల్పించిన సమయంలో పిల్లల పేర్లను కార్డులో చేర్పించారు. గ్రామాల్లో వలంటీర్లు నయాపైసా ఖర్చు లేకుండా అనేక కార్యక్రమాలను ప్రజలకు అందించారు. వాళ్లను వీధిన పడేయటం ఈ ప్రభుత్వానికి మంచిదికాదు.

– మదాసు శ్యామల, చిన్నటేకూరు, కల్లూరు మండలం

మంత్రి అనుచరులకే ‘దేవ’ భూములు!



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): విలువైన దేవదాయ భూములను కర్నూలులో తక్కువ ధరకు మంత్రి తన అనుచరులకు ఇప్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఎస్వీ కాంప్లెక్స్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవదాయ భూములను లీజు పేరుతో స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. ఈ భూముల విషయంలో హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని, అయినా క్యాబినెట్ దృష్టికి తీసుకుపోకుండా దొడ్డిదారిన జీవో తెచ్చారన్నారు. ధార్మిక సంస్థలు, ఎన్‌జీఓల ముసుగులో టీడీపీ నేతల అనుచరులకు ఈ భూములను అప్పగిస్తున్నారన్నారు. తాము 20 సంవత్సరాలుగా సాంస్కృతిక విభాగంలో ఎన్నో సేవలు చేస్తున్నామని తమకు ఈ భూములు లీజుకు ఇస్తారా అని ప్రశ్నించారు.

అడ్డగోలుగా భూముల దోపిడీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూములను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఎస్వీ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సనాతన వాది పేరుతో గుళ్ల గోపురాలు తిరిగిన ఆయన దేవదాయ భూములు అన్యాక్రాంతం అవుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదన్నారు.

న్యాయ పోరాటం

టీడీపీ నేతలు దోచుకుంటున్న దేవదాయ భూములపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటానికి సిద్ధమవుతుందని ఎస్వీ అన్నారు. దేవదాయ భూముల లీజు ప్రక్రియను రద్దు చేయాలన్న డిమాండ్‌తో హైకోర్టును ఆశ్రయిస్తున్నామన్నారు. జూన 4న నిర్వహించే ‘వెన్నుపోటు దినం’ నిరసనలో దేవదాయ భూముల లీజు వ్యవహారంపై ఆందోళనలు చేపడతామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్పొరేటర్ షేక్ యూనుస్‌బాషా, రెడ్డిపోగు ప్రశాంత్, ఫిరోజ్, మహిళ నాయకులు మంగమ్మ, భారతి పాల్గొన్నారు.

పింఛన్ల రీవెరిఫికేషన్ సాగదీత

కర్నూలు(అగ్రికల్చర్): ఇప్పట్లో కొత్త పింఛన్లు ఇచ్చే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదనే విషయం స్పష్టమవుతోంది. దివ్యాంగుల పింఛన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియను సుదీర్ఘంగా నిర్వహిస్తుండమే ఇందుకు ప్రధాన కారణం. ఈ ప్రక్రియ మరో మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2024 మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తామని చంద్రబాబునాయుడు ఊరూవాడా తిరిగి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీనే విస్మరించడం గమనార్హం. కర్నూలు జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు 30,700 ఉండగా.. జనవరి నుంచి వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతున్నా ఇప్పటి వరకు 18,103 పింఛన్లను మాత్రమే పునఃపరిశీలించారు. నంద్యాల జిల్లాలో 25,337 దివ్యాంగుల పింఛన్లు ఉండగా ఇప్పటి వరకు 16,609 పింఛన్లను మాత్రమే రీ వెరిఫికేషన్ చేసినట్లు సమాచారం.

- ఇదిలాఉంటే జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 31నే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వై.వి.రమణారెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 4,50,577 పింఛన్లకు రూ.195.32 కోట్లు మంజూరయ్యాయన్నారు.

సబ్సిడీ విత్తన ధరలు ఖరారు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేసే విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీలను ఖరారు చేసింది. జిల్లాకు వేరుశనగతో పాటు 892 క్వింటాళ్ల కందులు, 25 క్వింటాళ్ల మినుములు, 10 క్వింటాళ్ల పెసర, 70 క్వింటాళ్ల కొర్ర, 154 క్వింటాళ్ల దయంచా, 11 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలను కేటాయించింది. విత్తనాల పంపిణీ జూన్ రెండవ వారం నుంచి చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

- మినుము కిలో పూర్తి ధర రూ.138 ఉండగా.. సబ్సిడీ రూ.41.40.
- పెసర కిలో పూర్తి ధర 135 ఉండగా.. సబ్సిడీ రూ.40.50.
- కందులు కిలో పూర్తి ధర రూ.109.50 కాగా.. సబ్సిడీ రూ.32.85.
- కొర్ర కిలో పూర్తి ధర రూ.60 ఉండగా.. సబ్సిడీ రూ.30.
- వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93 కాగా.. సబ్సిడీ రూ.37.20.
- దయంచ కిలో ధర రూ.123, సన్‌హెంప్ కిలో ధర రూ.109, పిల్లిపెసర కిలో ధర రూ.180 కాగా.. వీటిని 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

జీడీపీ గేట్ల మరమ్మతుల పరిశీలన



జీడీపీ గేట్లను పరిశీలిస్తున్న ఈఈ పాండురంగయ్య

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) గేట్ల మరమ్మతులను శుక్రవారం నీటిపారుదల శాఖ ఈఈ పాండు రంగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రాజెక్టులో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. బండగట్టు, పత్తికొండ, కృష్ణగిరి, డోన్ పట్టణాలకు తాగునీటి కోసం జీడీపీ నుంచి వదులుతున్నట్లు తెలిపారు. గేట్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉగ్ర నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

చనుగొండ్ల సమీపాన దారి దోపిడీ

కోడుమూరు రూరల్: గూడూరు నుంచి కోడుమూరుకు వచ్చే రోడ్డులో చనుగొండ్ల సమీపాన దారి దోపిడీ జరిగింది. బైక్‌పై వస్తున్న గూడూరుకు చెందిన మున్న అనే వ్యక్తిపై కొందరు గుర్తుతెలియని దుండగులు దాడి చేసి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గూడూరుకు చెందిన మున్న భార్య ఊరైన గోనెగండ్లలో కూలిపనులు చేసుకుంటూ గూడూరుకు అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. గురువారం రాత్రి గూడూరుకు వచ్చి గోనెగండ్లకు బైక్‌పై వెళుతుండగా చనుగొండ్ల దాటిన తర్వాత ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. అనంతరం మున్నను తీవ్రంగా కొట్టుకుంటూ పక్కనున్న ముళ్లపొదల్లోకి లాక్కెళ్లి కత్తులతో బెదిరించి జేబులో ఉన్న రూ.5వేల నగదును లాక్కున్నారు. అనంతరం అటుగా వాహనాలు రావడం, బాధితుడు అరవడంతో దుండగులు మున్నను వదిలేసి పారిపోయారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా టీడీ పీ నేత వై.నాగేశ్వరరావు యాదవ్‌ను నియమి స్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్వస్థలం డోన్ నియోజక వర్గం ప్యాపిలి మండలం చంద్రపల్లి గ్రామం. ఇదిలాఉంటే ఏడుగురితో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ ఏర్పాటు కావాల్సి ఉండగా.. ప్రస్తుతానికి చైర్మన్ ఒక్కరినే నియమిస్తూ జీవో జారీ కావడం గమనార్హం. అదేవిధంగా పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన టీడీపీ నేతలకు పదవులు కట్టబెడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

● జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక వేత్తలు

కర్నూలు(సెంట్రల్): జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్‌కో తదితర కంపెనీలు స్థాపించిన పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను పి.రంజిత్‌బాషా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సింగిల్ డెస్కులో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లాలో టమాట, ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి 2,135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపామని, వీటి మంజూరుపై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి అంచనాలు వేయించాలని కర్నూలు మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం రూ.1.61 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపారు.

ఈదుల దేవరబండలో ఉల్లి ప్రాసెస్ యూనిట్

పత్తికొండ సమీపంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. దేవనకొండ మండలం ఈదుల దేవరబండలో 10 ఎకరాలను ఉల్లి ప్రాసెస్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించామని ఏపీఐఐసీ జెడ్ఎం వివరించారు. బనవాసి దగ్గర టెక్స్‌టైల్ పార్కు నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం అరుణ తెలిపారు. కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసరెడ్డి, పీసీబీ ఈఈ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయకుమార్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, దళిత్ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృష్టితో సమస్యలు పరిష్కరించాలి

● జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): శాస్త్రీయ దృష్టితో సమస్యలు పరిష్కరించాలని జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలకు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి సూచించారు. కర్నూలులోని బిర్లా కాంపౌండ్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలకు మూడు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ..ప్రతి పౌరుడు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బర్మా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా అక్షరాస్యత, పొదుపు, విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి జేవీవీ పనిచేసిందని చెప్పారు. విద్యార్థి నాయకులు కృష్ణాజీ, మహమ్మద్ మియ్య, శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు రమణయ్య, సుజాత, మీనా, శాంతి, చక్రపాణి, డాక్టర్ కోటేశ్వరరావు, శ్రీను, వెంకటరమణారెడ్డి, సుధాకర్, హరేరామ్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని నీలిషికారి పేటలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సీఐ రామాంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు మారుతి, రమేష్,బాబు, వీరస్వామి, మూకుమ్మడిగా దాడులు చేశారు. సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ శాఖ ఎస్ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. నీలిషికారి రాధ, రేణుక, మహేష్ నుంచి 70 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశా రు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారీ, విక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైల్‌కు తరలిస్తామన్నారు. అనంతరం కాలనీవాసులకు 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు.

బాల్య వివాహం చేస్తే రెండేళ్ల జైలు శిక్ష

● సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): బాల్య వివాహాలు జరిపిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో బాల్య వివాహ నిరోధక చట్టంపై పురోహితులు, పాస్టర్లు, ఆలయాల ఈఓలు, కాలేజీల అధికారులకు శుక్రవారం అవాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ.. ఎవరైనా బాల్య వివాహాలు చేయమని వస్తే 15100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్‌పీడీ శారద మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో బాల్య వివాహాల నిరోధానికి కమిటీలు ఉన్నట్లు చెప్పారు. ఎస్ఐ కిరణ్, సండే చంద్రశేఖర్, కంచు గంటల శ్యామ్‌సుందర్, ఖాజీ మౌలానా సయ్యద్ అక్బర్, పాస్టర్ కృపానందం పాల్గొన్నారు.

కొండను కొల్లగొడుతున్నారు!



కొండలో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

కర్నూలు(రూరల్): టీడీపీ నాయకుల అండతో దిగువపాడు గ్రామం సమీపాన ఉండే కొండను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. రోజుకు వందల టన్నుల మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామ సమీప వెంచర్లు, ఇతర అవసరాలకు ట్రాక్టర్ ఎర్రమట్టినిరూ. 1,000 నుంచి రూ.1,500 వరకు అమ్ముతున్నారు.

విద్యార్థులకు 'పర్యావరణ' పోటీలు

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఉన్న వారు జూన్ 2లోపు https://pcb. ap.gov.inలో పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు దక్కింది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పార్టీ అనుబంధ విభాగాలకు నాయకులను నియమించారు. శుక్రవారం రాత్రి ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

హోదా	పేరు	నియోజకవర్గం
రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు	బుట్టా ప్రతూల్	ఎమ్మిగనూరు
రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి	బూసినె చంద్రశేఖర్	ఆలూరు
రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి	దిద్దికాటి రఘురాముడు	మంత్రాలయం
రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి	ఎస్.ధరణి శ్రీనివాసరావు	కర్నూలు
రాష్ట్ర ఐటీ విభాగం సంయుక్త కార్యదర్శి	పి.రాజశేఖర్	ఎమ్మిగనూరు

వివాహితపై హత్యాయత్నం

● నోట్లో మాత్రలు కుక్కి భర్త, మరిది అమానుషం



కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షెహనాజ్

వెల్దుర్తి: ఓ వివాహితపై భర్త, మరిది హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన షెహనాజ్‌కు, తడకనపల్లె గ్రామానికి చెందిన మౌలాలికి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. మౌలాలి తన తమ్ముడు నాసిర్‌తో కలిసి ప్రస్తుతం వెల్దుర్తి పట్టణంలోని వడ్డెగేరిలో నివాసముంటున్నారు. గురువారం రాత్రి షెహనాజ్ పరిస్థితి విషమంగా ఉందని ఆమె సోదరి అబ్దుల్లాకు సమాచారం అందడటంతో ఆమెను వెల్దుర్తి సీహెచ్‌సీకు తరలించాడు. అప్పటికే జ్వరం, కడుపు నొప్పి, మోకాళ్ల నొప్పి ఇతరత్రా మందుమాత్రలు 40 వరకు ఆమె తిన్నట్లు తెలుసుకున్న వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం షెహనాజ్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షెహనాజ్‌ను వదిలించుకోవాలని కుట్రతోనే ఆమె భర్త మౌలాలి, మరిది నాసిర్‌లు మందుమాత్రలు బలవంతంగా కుక్కి హత్యాయత్నం చేసినట్లు బాధితురాలి అక్క నస్రీన్, బావ సుభాన్, తమ్ముడు అబ్దుల్లా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు షెహనాజ్ భర్త మౌలాలి, మరిది నాసిర్‌లను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

అనుమానమే పెనుభూతమై..

● భార్యపై ఎరుకలి కొడవలితో దాడిచేసిన భర్త



రక్తపుమడుగులో జయంతి

పెద్దకడబూరు: భార్యపై అనుమానంతో ఎరుకలి కొడవలితో భర్త దాడి చేశాడు. భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన కంబదహాల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కంబదహాల్ గ్రామానికి చెందిన జయమ్మ కూతురు జయంతిని ఆలూరు మండలం అంగస్కల్ గ్రామానికి చెందిన వేమారెడ్డి అలియాస్ మద్దికెర నేమిరెడ్డికి ఇచ్చి 16 సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మనస్పర్ధలు రావడంతో మూడు సంవత్సరాల క్రితం కుమారులను భర్త దగ్గరే వదిలి జయమ్మ పుట్టినిల్లు అయిన కంబదహాల్ గ్రామానికి వెళ్లారు. తల్లి జయమ్మతో కలసి ఉంటున్నారు. విడాకుల కోసం ఆదోని కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుంటదని భర్త భావించి చంపేస్తానంటూ ఫోన్ చేసి బెదిరించేవాడు. శుక్రవారం కంబదహాల్‌కు వచ్చి భార్య పైన, అత్తపైన తన వెంట తెచ్చుకున్న ఎరుకలి కొడవలితో దాడి చేశాడు. దాడిలో తల్లి, కూతుళ్లకు ఇద్దరికి రక్త గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. బాధితురాలు జయంతి ఫ్యిరాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా ఉద్యోగిపై దాడి

ఆలూరు: తన విధులకు ఆటంకం పరచడంతో పాటు తనపై దాడి చేశారని ఆలూరు ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శశికళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్‌పై కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న హీరాసింగ్ తన సమీప బంధువులతో దాడి చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శశికళ, కంప్యూటర్ ఆపరేటర్ హీరాసింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు గట్టిగా అరుపులు, కేకలు వేయడంతో ఎంపీడీఓ మద్దిలేటి స్వామి, అటెండర్ గాదిలింగ వారించేందుకు ప్రయత్నించారు. అయినా ఇద్దరు దూషించుకున్నారు. మహిళా ప్రభుత్వ ఉద్యోగి అని చూడకుండా హీరాసింగ్ అసభ్య పదజాలతో దూషించారని, విధులకు ఆటకం కలిగించారని, సమీప బంధువులతో దాడి చేయించారని జూనియర్ అసిస్టెంట్ శశికళ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దాసుపత్రిలో ఊడిన పెచ్చులు



ధన్వంతరి హాలులో పెచ్చులూడిన ప్రాంతం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పరిపాలనా భవనంలో ఉన్న ధన్వంతరి సమావేశ మందిరంలో పెచ్చులూడి పడ్డాయి. శుక్రవారం సాయంత్రం ఈ మందిరంలో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం తర్వాత ధన్వంతరి హాలులో ఉన్న ఫలంగా పెచ్చులూడి పడటంతో మందిరంలో ఓ మూలన పైకప్పు కింద పడిపోయింది. దీంతో మంత్రి సమీక్షను ప్రభుత్వ అతిథిగృహానికి మార్చారు. పెచ్చులూడిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. – కర్నూలు(హాస్పిటల్)

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని రసాయన ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. శివరామకృష్ణ ఫర్టిలైజర్‌లో ఈ-పాస్ మిషన్‌లో కనిపించే స్టాకుకు, మాన్యువల్‌గా ఉన్న స్టాకులో భారీగా తేడాలను గుర్తించారు. రూ.96.95 విలువ చేసే బయో ఉత్పత్తులు, రసాయన ఎరువుల అమ్మకాలను నిలిపి వేశారు. కొత్తబస్టాండు దగ్గర ఉన్న అంబికా ట్రేడర్స్‌లో పురుగు మందుల వివరాలు, స్టాకు రికార్డులను పరిశీలించా రు. వివిధ బయో ఉత్పత్తులకు ఓఫామ్ వివరాలు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో రూ.27 లక్షల విలువ చేసే రూ.2443 లీటర్ల పురుగు మందులు, బయో ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ... పురుగుమందులు ,ఫర్టిలైజర్స్ దుకాణాలను 100 శాతం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రాంబాబు

సంజామల: సంజామల - కొలిమిగుండ్ల మధ్య ఉన్న రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ సంబంధించిన రెల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ కుర్వి మండలానికి చెందిన దుస్సా రాంబాబు (40) మతిస్థిమితం లేక 20 రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చి సంజామల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. గురువారం సంజామల-కొలిమిగుండ్ల సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేలైన్ వెంట నడిచి వెళ్తూ సంజామల సమీపంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడతో స్థానికులు గుర్తించి 108లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని వద్ద లభించిన ఆధారాలతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నంద్యాల చేరుకుని మృతదేహాన్ని సొంతూరుకు తీసుకెళ్లారు. మృతినికి భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతిని సోదరుడు వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.